క్లుప్తంగా

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

విశాఖ విద్య: పదో తరగతి సప్లిమెంటరీ (అడ్వాన్స్‌డ్) పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్ష జరిగింది. జిల్లాలోని 24 కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 2,041 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. వీరిలో 1,708 మంది పరీక్షకు హాజరయ్యారు. 333 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విద్యాశాఖాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 14 సెంటర్లను తనిఖీ చేశాయి.

ఎస్‌ఎంసీహెచ్ స్కూల్‌లో..



ఎస్‌ఎంసీహెచ్ స్కూల్ వద్ద పరీక్షకు హాజరైన టెన్త్ విద్యార్థులు

సీతమ్మధార: పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని ఎస్‌ఎంసీహెచ్ స్కూల్‌లో జరిగిన పరీక్షకు 57 మంది విద్యార్థులకు గానూ 9 మంది హాజరు కాలేదు. ఉదయం 8.30 గంటల నుంచి విద్యార్థులు స్కూల్ వద్దకు చేరుకుని పరీక్ష రాసి వచ్చారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పిస్తారు. భక్తులు తరలిరావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి బందారు ప్రసాద్ కోరారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో విషజ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు, దోమల నిర్మూలన కోసం ఫాగింగ్ చేశారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సూచనల మేరకు శుక్రవారం సీతన్న గార్డెన్స్, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వీధి ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సాధు ఫాగింగ్ చేయించారు.

పోలీసుల అదుపులో ముగ్గురు రౌడీ షీటర్లు



ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి దొండపర్తిలోని ఓ బార్ వద్ద రెండు రోజుల కిందట ఒక వ్యక్తిని ముగ్గురు యువకులు(రౌడీ షీటర్లు) చితకబాది పరారయ్యారు. ఫోర్త్ టౌన్ పోలీసుల సమాచారంతో రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఆటపాటలతోపాటు పుస్తక పఠనం



పాఠశాల లైబ్రరీ నుంచి పుస్తకాలు తీసుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

- వేసవి సెలవుల్లో 'వుయ్ లవ్ రీడింగ్'
- చదువుకు దూరం కాకుండా ప్రత్యేక కార్యక్రమం
- విద్యార్థుల ఇళ్లకు వెళ్లి గైడ్ చేస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట: వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆటపాటల్లో మునిగి తేలుతుంటారు. చాలా మంది పిల్లలు టీవీ, ట్యాబ్, సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తూ చదువు దూరమవుతున్నారు. అప్పటి వరకు చదివిన పాఠ్యాంశాల బేసిక్స్ సైతం మరిచిపోతున్నారు. సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచాక పాఠాలు అర్థం కాక బిక్క మొహం వేస్తుంటారు. దీనిని అధిగమించేలా పాఠశాలలకు ప్రకటించిన 42 రోజుల వేసవి సెలవుల్లో విద్యార్థులు చదువుకు దూరం కాకుండా.. పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించేలా విద్యా శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. అన్ని ప్రభుత్వ పాఠశాల్లో 'వుయ్ లవ్ రీడింగ్' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించి వారికి ఐరన్‌ఫోలిక్ మాత్రలు ఇచ్చి ప్రతి రోజూ వాటిని మింగేలా ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలను పీడీఎఫ్ రూపంలో విద్యార్థుల ట్యాబ్స్, సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించి వాటిని చదివిస్తున్నారు. పాఠశాల ప్రారంభం నాటికి కొత్త సిలబస్‌పై విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

తొమ్మిది జీవీఎంసీ హైస్కూళ్లలో..

ఉత్తర నియోజకవర్గంలోని తొమ్మిది జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో వుయ్ లవ్ రీడింగ్‌తోపాటు ఐరన్‌ఫోలిక్ మాత్రల పంపిణీ, పీడీఎఫ్ డౌన్‌లోడింగ్ కార్యక్రమాలు పక్కాగా అమలవుతున్నాయి. వుయ్ లవ్ రీడింగ్‌లో భాగంగా పాఠశాల లైబ్రరీలోని పుస్తకాలను విద్యార్థులు ఒక్కొక్కరికీ ఒక్కోటి చొప్పున అందజేశారు. తెలుగు, ఇంగ్లిష్ స్టోరీ బుక్స్, జనరల్ నాలెడ్జి, సైన్స్, చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధులు, సైంటిస్టుల జీవిత చరిత్ర వంటి పుస్తకాలను అందించి చదివిస్తున్నారు.

చదివిన పుస్తకంపై సమీక్ష

విద్యార్థి తీసుకున్న పుస్తకం వారం రోజుల్లో చదివి దానిపై అభిప్రాయం, సమీక్ష రాయాలి. పుస్తకం చదివేశాక దగ్గరగా ఉన్న విద్యార్థులతో ఎక్స్ఛేంజ్ చేసుకుని మరో పుస్తకాన్ని చదవాలి. లేదా పాఠశాలకు వచ్చి వేరొక పుస్తకం తీసుకోవచ్చు. ఇలా ప్రతి విద్యార్థి వీలైనన్ని పుస్తకాలు చదివి సమీక్ష రాసేలా ఉపాధ్యాయులు గైడ్ చేస్తున్నారు. ప్రతి ఉపాధ్యాయుడికి కొంత మంది విద్యార్థులను అడాప్ట్ చేశారు. వీరు విద్యార్థుల గృహాలకు వెళ్లి పిల్లలు ఏ పుస్తకం చదివారు, ఎంత వరకు అర్థం చేసుకున్నారన్న దానిపై సమీక్ష రాశారా లేదా పరిశీలిస్తున్నారు. విద్యార్థుల గృహ సందర్శన చేసిన ఫొటోలను టీచర్లు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సెలవుల అనంతరం పిల్లలు చదివిన పుస్తకాలపై పోటీలు నిర్వహిస్తామని మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి తెలిపారు.



విద్యార్థిని ఇంటి వద్ద పుస్తక సమీక్షను పరిశీలిస్తున్న ఉపాధ్యాయిని

ఐరన్ ఫోలిక్ మాత్రల పంపిణీ

ఎనీమియా(రక్తహీనత) ఉన్న విద్యార్థులను పాఠశాల స్థాయిలో గుర్తించారు. వారిలో రక్తహీనత నివారించేలా ప్రతి రోజూ రెండు చొప్పున 40 రోజులకు 80 ఐరన్ ఫోలిక్ మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థులు అవి మాత్రలు మింగేలా ఏఎన్‌ఎంలు, సంబంధిత ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. ఆ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

పాఠ్యపుస్తకాల పీడీఎఫ్ డౌన్‌లోడింగ్

రాబోవు కొత్త తరగతులకు సంబంధించిన పాఠ్యపుస్తకాల పీడీఎఫ్‌లను విద్యార్థుల ట్యాబ్స్‌లోకి గాని, తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌లోకి గాని ఉపాధ్యాయులు డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. ఆ పాఠ్యపుస్తకాలను ఎలా చదవుకోవాలో నేర్పిస్తున్నారు.

కొత్త పాఠ్యాంశాలపై విద్యార్థులు పట్టు సాధించేలా ఉపాధ్యాయులు గైడ్ చేస్తున్నారు. కొత్త తరగతులకు విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేస్తున్నారు. వేసవి సెలవుల్లో సైతం ఉపాధ్యాయులు తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థినితో ఐరన్ ఫోలిక్ మాత్రలు మింగిస్తున్న సిబ్బంది



పాఠ్యపుస్తకాల పీడీఎఫ్‌ను సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయిస్తున్న ఉపాధ్యాయురాలు

ధనలక్ష్మీదేవి, దుర్గమాంబలకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం ధనలక్ష్మీదేవి, దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ధనలక్ష్మీదేవివి ప్రధాన అర్చకుడు శ్యామాచార్యులు, దుర్గాదేవికి ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ కుంకుమ పూజలు, పూల, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయాల కమిటీ సభ్యులు, సేవా దళం సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ధనలక్ష్మీదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు



ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ

పది లఘు చిత్రాల ప్రదర్శన

సీతంపేట: 'ప్రపంచ మేధో సంపత్తి మహిళలు' అనే అంశంపై గత ఏప్రిల్‌లో జెనీవాలో జరిగిన లఘు చిత్రాల పోటీల్లో మొదటి పది స్థానాల్లో నిలిచిన వాటిని శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో పనిచేస్తున్న డాక్టర్ నీలిమ ఏటికొప్పాక బొమ్మలపై రూపొందించిన లఘు చిత్రానికి రెండో స్థానం దక్కిందని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన లా యూనివర్సిటీ వీసీ పి.సుధ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వాలు, సమాజంపై సహకరించవలసిన బాధ్యత ఉందన్నారు. మేధో సంపత్తి ఏ ఒక్కరికీ పరిమితం కాదని, అవి ప్రదర్శించడానికి సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా సుధను ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎన్.ఎ.డి.పాల్, సంయుక్త కార్యదర్శి బి.చిన్నారావు, డాక్టర్ బాబ్జీ, కార్యవర్గ సభ్యులు అనూరాధ, మూర్తి, ఆర్.శివకుమార్, సామాజిక కార్యకర్త బి.రమాప్రభ పాల్గొన్నారు.



లా యూనివర్సిటీ వీసీ సుధను సత్కరిస్తున్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీసీఎస్ పీఎస్‌లో దత్తపవర్

సీతమ్మధార: మహారాష్ట్ర నుంచి ఒడిశాకు పిస్టల్‌ను తరలించేందుకు సహకరించిన దత్తపవర్‌ను ఫోర్త్ టౌన్ పోలీసులు మహారాష్ట్ర నుంచి నగరానికి శుక్రవారం తీసుకొచ్చారు. శ్రీధర్ హరికిషన్ పతాంగికి పిస్టల్ ఇచ్చి పంపిచవలసిన అవసరం ఏంటని విచారణ చేపట్టారు. ప్రస్తుతం సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో పిస్టల్ ఇచ్చిన వ్యక్తిని పూరిలో ఉన్న వ్యక్తి ఎవరు..? అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

విభజన హామీలు నెరవేర్చాలి

సీతమ్మధార: విభజన హామీలు నెరవేర్చని ప్రభుత్వాల మొండి వైఖరి వల్ల రాష్ట్రానికి నష్టం కలుగుతోందంటూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఆమ్ ఆద్మీ పార్టీ అవగాహన, నిరసన కార్యక్రమం చేపట్టింది. నేతలు మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా ద్వారా పరిశ్రమలకు కేంద్ర రాయితీలు, విద్యుత్ రాయితీలు, తద్వారా యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్, రిమాండ్



పుట్టా సతీష్

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా.. గురువారం రాత్రి అక్కయ్యపాలెం వెంకటేశ్వర కల్యాణ మండపంలో పెళ్లి జరిగింది. బంధువుల భోజనాల అనంతరం మండపం వద్ద ఒక యువకుడు రెక్కీ నిర్వహించాడు. పెళ్లికి వచ్చిన విజయనగరానికి చెందిన జయ కుటుంబ సభ్యులు రాత్రి 11 గంటల సమయంలో భోజనం చేసి కిందకు వచ్చారు. అక్కడే ఉన్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పుట్టా సతీష్ ఒక్కసారిగా జయ మెడలో ఉన్న బంగారు గొలుసు స్నాచింగ్ చేశాడు. ఆమె ఒక చేతితో పట్టుకోవడంతో సగం బంగారు పట్టుకొని పారిపోయాడు. వెంటనే బాధితురాలు డయల్ 100కు కాల్ చేయడంతో శుక్రవారం వేకువజామున సతీష్‌ను క్రైం పోలీసులు పట్టుకుని అదుపులోకి తీసుకుని విచారించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు క్రైం ఎస్‌ఐ ఖగేశ్వరరావు చైన్ స్నాచర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.

జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్‌లో పంపించాలి

మురళీనగర్: హయ్యర్ వేజ్ పింఛన్ కోసం సభ్యులు, పెన్షనర్లు జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్‌లో పంపించుకోవాలని రీజినల్ పీఎఫ్ కమిషనర్–2 పవన్ కుమార్ జాస్తి ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈపీఎఫ్ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీ నుంచి వచ్చిన సర్క్యులర్‌ను అనుసరించి ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ 1995 సంబంధించిన పింఛన్‌దారులు అధిక పింఛన్ కోసం యాజమాన్యంతో కలిపి జాయింట్ ఆప్షన్ ఫారాలను ఆన్‌లైన్‌లో మాత్రమే పంపించాల్సి ఉంటుందన్నారు. https://unifiedportal-mem.epfindia.gov.in వెబ్‌సైట్‌లో ఫారాలు పంపించుకోవాల్సి ఉంటుందన్నారు.

నీతి కథలతో క్రమశిక్షణ



కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులతో కథలు చదవడం, రాయడం కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తక ప్రదర్శనలో భాగంగా బాలసాహిత్యం పుస్తకాలను ప్రదర్శించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించే పుస్తకాలను చదివించారు. సచివాలయ మహిళా పోలీస్ ఎం.భాగ్యశ్రీ, వెల్ఫేర్ అసిస్టెంట్ హరిత చంద్రిక, రిసోర్స్ పర్సన్‌లు మాట్లాడారు. నీతి కథలు చదవడం వల్ల విద్యార్థుల్లో పెద్దలపై గౌరవ భావాలు పెరగడంతోపాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. గ్రంథాలయ అధికారి వై.పద్మజ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వృద్ధుడి మృతి

మర్రిపాలెం: ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం రాస వీధిలో పట్నాల కాళిదాస్(60) అనే వృద్ధుడు ఒంటరిగా నివసిస్తున్నాడు. రెండు రోజులుగా అతడు ఇంట్లో నుంచి బయటకు రాలేదు. పక్కనే నివసిస్తున్న కాళిదాస్ అన్నయ్య పట్నాల గురునాథరావు ఇంటికెళ్లి చూడగా.. దుర్వాసన వచ్చింది. దీంతో తలుపులు తెరచి చూడగా కాళిదాస్ మృతిచెంది ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. శుక్రవారం మృతుడి అన్నయ్య ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఏఎస్‌ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు. కాళిదాస్ మరణానికి గల కారణాలను తెలుసుకుంటున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ సబ్ స్టేషన్ పరిధిలోని హై టెన్షన్ లైన్స్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఆపరేషన్ ఈఈ జి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్, ఎన్‌జీవోస్ కాలనీ, జీవీఎంసీ హెల్త్ సెంటర్, పద్మశ్రీ హాస్పిటల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు ప్రారంభం



జట్లను పరిచయం చేసుకుంటున్న సీపీ

విశాఖ స్పోర్ట్స్: విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో బాలుర విభాగంలో 12 జట్లు, బాలికల విభాగంలో ఆరు జట్లు పాల్గొంటున్నాయి. ఈ పోటీల్లో సత్తాచాటిన బాలబాలికలను జిల్లా జట్లుగా ఎంపిక చేసి ఈనెల 29 నుంచి నూజివీడులో జరిగే అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు పంపనున్నారు. ఈ సందర్భంగా పోటీలను నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ ప్రారంభించి జట్లను పరిచయం చేసుకున్నారు. అతిథిగా సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ హాజరు కాగా జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సీతమ్మధార రైతుబజార్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం సీతమ్మధార రైతు బజార్‌లో నర్సీపట్నానికి చెందిన కళాబృందంచే పర్యావరణ పరిరక్షణపై కళాజాత ప్రదర్శించారు. పర్యావరణాన్ని కాపాడుకుందామని బుర్రకథ ద్వారా ప్రజలు, రైతులు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. మానవాళి మనుగడకు చెట్లు నాటుదాం.. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి, గుడ్డ సంచులు వినియోగిద్దామని కళాకారుల తమ ఆటపాటలు, జానపద గీతాలతో పిలుపునిచ్చారు. కళా ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాకారులు వై.వెంకటేశ్వరరావు, రామలింగేశ్వరరావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.16 లక్షలతో బీటీ రోడ్లు



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో రూ.16 లక్షల వ్యయంతో బీటీ రోడ్లు నిర్మిస్తున్నారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చేతుల మీదుగా శుక్రవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతంపేట దుర్గాగణపతి ఆలయం ఎదురుగా ఉన్న మధురానగర్ మొదటి, మూడో లైన్లలో బీటీ రోడ్ వేస్తారని తెలిపారు. వార్డులో శిథిలమైన రహదారులు, డ్రెయిన్లు కొత్తగా నిర్మిస్తున్నామని, ముస్ముందు మరిన్ని అభివృద్ధి పనులు వార్డులో చేపట్టనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, వార్డు యూత్ ప్రెసిడెంట్ సన్నీ, సచివాలయ కన్వీనర్లు, అడ్మిన్లు, కార్యదర్శులు, గృహసారథులు, వలంటీర్లు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నేడు, రేపు నీటి సరఫరా ఉండని ప్రాంతాలు

సీతంపేట: జీవీఎంసీ టీఎస్సార్ ప్రాంగణంలోని వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తున్న కారణంగా శని, ఆదివారాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు జోన్–3 పరిధిలోని సీతంపేట, అక్కయ్యపాలెం లలితా నగర్, ఎన్జీజీవోస్ కాలనీ, చిన్నూరు, నరసింహనగర్, గణేష్‌నగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్, మద్దిలపాలెం, చైతన్యనగర్, వినాకయ నగర్, మంగాపురం కాలనీ, పిఠాపురం కాలనీ, శివాజీపాలెం, మద్దిలపాలెం, ఎంవీపీ 1 నుంచి 12 సెక్టార్లు, జాలరిపేట, వాసవానిపాలెం, ఆదర్శనగర్, పెదవాల్తేర్, చినవాల్తేర్, పాండురంగాపురం, రేసపువానిపాలెం, పీతలవానిపాలెం ప్రాంతాలు.. జోన్–5 పరిధిలోని శ్రీనివాసనగర్, నందగిరినగర్, నరసింహనగర్, రైల్వే న్యూకాలనీ, వెంకటేశ్వర కాలనీ, జ్ఞానాపురం, బాబూ కాలనీ, సిరుల వీధి, సెబాస్టియన్ కాలనీ, జేఎస్‌ఎస్‌యూఆర్‌ఎం కాలనీ, సుబ్బలక్ష్మినగర్, తాటిచెట్లపాలెం, అబిద్‌నగర్, శ్రీనివాసనగర్, చెక్కు దురాయి బిల్డింగ్, దాడి రామ్మూర్తి కల్యాణ మండపం, చాకలిపేట, టీఎస్‌ఎన్ కాలనీ ప్రాంతాలను శనివారం ఉదయం 10 నుంచి ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు నీటి సరఫరా జరగదని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

కనకమాంబ పండగకు ఉత్సవ రాట



ఉత్సవ రాట వేస్తున్న కమిటీ ప్రతినిధులు

సీతంపేట: శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి పండగ మహోత్సవ ఉత్సవ రాట కార్యక్రమం శుక్రవారం ఉదయం ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆలయ అర్చకులు శివగణేష్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్దలు, సంఘ ప్రతినిధుల సమక్షంలో ముత్తయిదువలతో కలిసి ఉత్సవ రాట వేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ఈ నెల 12న కనకమాంబ అమ్మవారి తొలేళ్లు, 13న ప్రధాన పండగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి సారిపిల్లి గంగరాజు, కోశాధికారి బోర వెంకటరమణ, గ్రామ పెద్దలు నమ్మి వెంకట్, బోర గోవిందు, ఇసరపు అప్పారావు, ఒమ్మి అప్పలరాజు, సానబోయిన సురేష్, నమ్మి రవికుమార్, వారాది శ్రీనివాస్, కేత గంగరాజు, ముచ్చల రాజు, పల్లా నూకరాజు, ఆవాల వెంకట్, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారి



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు కె.సుధ(టెక్నికల్), సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్)లు తెలిపారు. హోబిల్ బిలోస్ ఎంఎస్‌ఎన్ లేబరేటరీస్ హైదరాబాద్, హెటిరో, దక్కన్ ఫైన్ కెమికల్స్ తుని, మెడ్ ప్లస్ ఫార్మా విశాఖ, అనకాపల్లి, తమ్మినా సాఫ్ట్‌వైర్ సొల్యూషన్, టీజేఎల్ ఎస్‌డీటీ టెక్నాలజీస్‌తో పాటు పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 560 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 1,013 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 305 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి, కె.సుధా చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

దాబాగార్డెన్స్: పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జోన్–4 పరిధి సెంట్రల్ పార్క్, రామ్‌నగర్, గవర్నర్ బంగ్లా, జిల్లా పరిషత్ జంక్షన్, మహారాణిపేట, ద్రోణంరాజు సర్కిల్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. రాత్రి పారిశుద్ధ్య పనులు సరిగ్గా నిర్వహించడం లేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్‌కోర్ట్ ప్రాంతంలో శానిటేషన్ పరిశీలించారు. ఎవరి బడ్డీల కింద ఉన్న వ్యర్థాలను దుకాణదారులు తొలగించాలని ఆదేశించారు.

దహన ఖర్చులు చెల్లించండి

అల్లిపురం: జీవీఎంసీ రెగ్యులర్ ఉద్యోగులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు తక్షణమే దహన ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు చెల్లించేలా జీవీఎంసీ కమిషనర్ సీహెచ్ సాయికాంత్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వీవీ రామారావు, ప్రధాన కార్యదర్శి నరసింగరావు శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఉద్యోగి చనిపోయి సంవత్సరం గడిచిపోయినా దహన ఖర్చులు అందక వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులుకు గురయ్యేవారన్నారు. ఈ విషయాన్ని కమిషనర్ సాయికాంత్‌వర్మ దృష్టికి యూనియన్ నాయకులు తీసుకురావటంతో, తక్షణమే స్పందించిన ఆయన హెచ్‌వోడీలకు లక్ష రూపాయల చొప్పున అడ్వాన్స్ మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారని చెప్పారు.